**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ : 08-2-2026** **సమయం13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. కరీంనగర్ కార్పొరేషన్ సహా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు కేంద్రం ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.
2. మేడ్చల్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో పునరాభివృద్ధి చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇప్పటి వరకు 83 శాతం పనులు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు.
3. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.
4. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు.

.....................................................

**చొప్పదండి-బండి సంజయ్**

కరీంనగర్ కార్పొరేషన్ సహా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతోనే అభివృద్ధి చెందుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ఉదయం కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. వీధి దీపాల ఏర్పాటు మొదలుకొని రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పార్కుల

నిర్మాణం వరకు ప్రతి పనికి కేంద్రమే నిధులు ఇస్తోందన్నారు. కానీ రాష్ట్రంలోని పార్టీలు ఆ క్రెడిట్ తమదే అన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నాయని విమర్శించారు. తన వంతుగా నియోజకవర్గంలోని పదో తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు అందించి, పరీక్ష ఫీజులు చెల్లించానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

..........పీటీసీ, కరీంనగర్

**మేడ్చల్ రైల్వే స్టేషన్-కిషన్ రెడ్డి**

మేడ్చల్-మల్కాజ్ గిరిలోని మేడ్చల్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో పునరాభివృద్ధి చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇప్పటి వరకు **83 శాతం పనులు పూర్తయ్యాయని** కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు. సుమారు **32.11 కోట్ల రూపాయల** వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయాణికులకు అత్యాధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన ప్రయాణ అనుభవం లభించనుందన్నారు. ఇప్పటికే స్టేషన్ పరిధిలో వెయిటింగ్ హాళ్లు, ప్లాట్‌ఫారమ్‌ల ఆధునీకరణ, 12 మీటర్ల వెడల్పు కలిగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ , పార్కింగ్ షెడ్ల నిర్మాణం వంటి కీలక పనులు ముగిశాయని సామాజిక మాధ్యమ పోస్టులో తెలిపారు. దేశవ్యాప్తంగా రైల్వే మౌలిక సదుపాయాలను సమూలంగా మారుస్తూ, ప్రయాణికులకు అత్యుత్తమ సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు.

.........డెస్క్

**సంగారెడ్డి-మంత్రి దామోదర**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా 75 నుంచి 80 శాతం స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

నిన్న రాత్రి తన సొంత నియోజకవర్గమైన అందోల్ - జోగిపేటలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. అందోల్ - జోగిపేట ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

...........పీటీసీ, సంగారెడ్డి

**హరీశ్ రావు-సంగారెడ్డి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హారీశ్ రావు విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు అమలు చేసినప ప్రభుత్వం.. ఆర్టీసీ చార్జీలను రెట్టింపు చేసిందని ఆరోపించారు. 4 వేల రూపాయల పింఛన్, మహిళలకు 2500 రూపాయల సాయం హామీ ఏమైందని ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట, ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీల్లో ఈ ఉదయం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా హరీశ్ రావు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా శ్రేయస్సుకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో రెండేళ్ల తర్వాత మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని అన్నారు.

.............డెస్క్

**డీకే అరుణ-మహబూబ్ నగర్**

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, స్థానిక ఎంపీ డీకే అరుణ వెల్లడించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేంద్రం ఇప్పటివరకు సుమారు 800 కోట్ల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు. అమలుకు సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. పదేళ్లపాటు అవినీతి పాలన సాగించిన

బీఆర్ఎస్ దారిలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నడుస్తోందని, రాష్ట్రంలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందని విమర్శించారు.

**(సౌండ్ బైట్ డీకే అరుణ)**

.............పీటీసీ, మహబూబ్ నగర్

**కరీంనగర్ -అడ్లూరి లక్ష్మణ్**

రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు లోపాయికారీ ఒప్పందంతో కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. కరీంనగర్ అభివృద్ధిలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అడ్డుతగులుతున్నాయని, ఆ రెండు పార్టీలు లోలోపల ఒక్కటేనని మంత్రి ఆరోపించారు.నిన్న రాత్రి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని  పలు డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి మద్దతుగా నాకా చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి పాల్గొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు,అభివృద్ధి పనులను విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు.

...........పీటీసీ, కరీంనగర్

**ఫోరెన్సిక్ ల్యాబ్-శిఖా గోయెల్**

హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ-FSLలో జరిగిన అగ్నిప్రమాదంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను FSL డైరెక్టర్ శిఖాగోయల్ ఖండించారు. కీలకమైన కేసుల సాక్ష్యాధారాలు కాలిపోయాయన్న ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని ఆమె స్పష్టం చేశారు. 2015 నాటి ఏసీబీ కేసులో ఉన్న 16 వస్తువులను అప్పట్లోనే పరిశీలించి 2021లోనే కోర్టుకు అప్పగించామన్నారు. ప్రస్తుతం ల్యాబ్‌లో ఆ కేసుకు

సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవని వెల్లడించారు. త్వరలోనే ల్యాబ్ విధులను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థల వద్ద ఉన్న రికార్డులు భద్రంగా ఉన్నాయని, నిరాధారమైన పుకార్లను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

**(సౌండ్ బైట్ శిఖా గోయల్)**

**కామారెడ్డి-కేటీఆర్**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను, 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి తారక రామారావు విమర్శించారు. నిన్న రాత్రి కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. మహిళలకు ఇస్తానన్న 25 వందల రూపాయల ఆర్థిక సాయం, తులం బంగారం హామీలను ప్రభుత్వం విస్మరించిందని ధ్వజమెత్తారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా మోసం చేసిందని, కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలను కోరారు.

.............పీటీసీ, కామారెడ్డి

**కామారెడ్డి-వంట గ్యాస్**

కామారెడ్డి జిల్లాలోని జిల్లా కేంద్రంతో పాటు లింగంపేట ప్రాంతాల్లో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వాడుతున్న వాణిజ్య సంస్థలపై జిల్లా అధికారులు కేసులు నమోదు చేశారు. సహాయ పౌర సరఫరాల అధికారి , డిప్యూటీ తాసిల్దార్ల నేతృత్వంలోని రెండు ప్రత్యేక బృందాలు హోటళ్లు, తినుబండారాల కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. మొత్తం 24 కేసులు నమోదు చేయడంతో పాటు 49 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

.........పీటీసీ, కామారెడ్డి

**వేములవాడ-బస్సులు**

మహాశివరాత్రి జాతర సందర్భంగా ఈ నెల 14 నుంచి 16 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు 600 ప్రత్యేక బస్సులు నడిపిస్తామని కరీంనగర్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాజు తెలిపారు. కరీంనగర్, కోరుట్ల, మెట్ పల్లి హైదరాబాద్, వరంగల్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్ నుంచి వేములవాడకు ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. భక్తులందరూ ఈ ప్రత్యేక బస్సులను సద్వి ని యోగం చేసుకోవాలని కోరారు.

..........పీటీసీ, సిరిసిల్ల

**మేడారం ప్రసాదం - కరీంనగర్**

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రసాదాన్ని భక్తుల చెంతకు చేర్చే ప్రక్రియలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ రీజియన్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా మొత్తం 211 బుకింగ్‌లు నమోదు కాగా, 63 వేల 89 రూపాయల ఆదాయం సమకూరింది. ప్రసాదం బుక్ చేసుకున్న భక్తులకు త్వరలోనే ప్రసాదం అమ్మవారి ఫోటో, పసుపు, కుంకుమలతో కూడిన ప్యాకెట్లను ఇంటికే పంపిణీ చేస్తామని కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ లాజిస్టిక్ ఏటీఎం కె. వెంకట్ నారాయణ, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రాజు తెలిపారు.

..........పీటీసీ, కరీంనగర్

**కొత్తగూడెం-విద్యాధికారి**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన మిషన్ పదవ తరగతి గోడ పత్రికను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా

రాష్ట్రస్థాయిలో మొదటి స్థానాన్ని సాధించిన విద్యార్థికి 5 లక్షల రూపాయలు, రెండవ స్థానానికి 3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్‌కు 2 లక్షల చొప్పున నగదు అందజేస్తారని, జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

...........పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం

**యాదాద్రి-రద్దీ**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఈ రోజు భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వాతి నక్షత్రం, సెలవు రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో కొండపైకి తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారికి శాస్త్రోక్తంగా అష్టోత్తర శతఘటాభిషేక పూజలను నిర్వహించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఇతర సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేశారు.

...........పీటీసీ, యాదాద్రి భువనగిరి

**సిరిసిల్ల-పోలీసులు**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు మొబైల్ ఫోనర్ల రికవరీలో దేశవ్యాప్త గుర్తింపును సాధించారు. సీఈఐఆర్ వ్యవస్థను సమర్థంగా వినియోగిస్తూ 78 శాతం మొబైల్ రికవరీ రేటు సాధించి దక్షిణాది రాష్ట్రాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపారు. ఈ నెల 12న కేరళ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ సదస్సుకు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితె హాజరై పురస్కారాన్ని స్వీకరించనున్నారు.

...........పీటీసీ, సిరిసిల్ల

**వరంగల్-సీఎం కప్**

హన్మకొండ జిల్లాలో జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు రేపు, ఎల్లుండి నిర్వహిస్తున్నట్లు డివైఎస్ఓ అశోక్ కుమార్ తెలిపారు. సీఎం కప్ పోటీలపై సన్నాహక సమావేశాన్ని సంబంధిత అధికారులు, క్రీడా సంఘాలతో నిర్వహించి, పోటీలను విజయవంతం చేయాలని సూచించారు.

..........వరంగల్ జిల్లా పిటిసి

**హన్మకొండ-తాగునీరు**

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో తాగునీటి సమస్యపై సమీక్షించిన కలెక్టర్ వేసవి నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

.........వరంగల్ జిల్లా పిటిసి

**ఆసిఫాబాద్-యూరియా**

ఆసిఫాబాద్ జిల్లాలోని రైతులు నేటి నుంచి యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్ ప్రకటనలో తెలిపారు. రైతులలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా యూరియా కొనుగోలు చేసుకోవచ్చన్నారు.

..........పీటీసీ, ఆసిఫాబాద్

**వరంగల్ ఎన్నికలు**

ఈనెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురి చేసే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

..........వరంగల్ జిల్లా పిటిసి